సికిల్ సెల్.. జాగ్రత్తలే మేలు

- పౌష్టికాహారంతోనే రక్తహీనతకు పరిష్కారం
- వ్యాధిపై అవగాహన తప్పనసరి
- ఉధృత ప్రచారం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం


పెనికేరులో సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన కల్పిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ రక్తహీనత అనేక అనారోగ్య సమస్యలకు కారణమవుతుంది. ఆడుతూ పాడుతూ కళ్లముందు చురుకుదనంతో కనిపించే చిన్నారులు ఒక్కసారిగా అనారోగ్యానికి గురై బక్కచిక్కి పోతుంటే కన్నపేగు తల్లడిల్లిపోతుంది. అల్లారుముద్దుగా చూసుకుంటూ గోరుముద్దలు పెట్టినా చలాకీతనం కానరాక నీరసంగా ఉంటుంటే ఆ తల్లిదండ్రులకు కంటి నిద్ర కరవవుతుంది. చిన్నారుల్లో సాధారణంగా సంభవించే రక్తహీనత సమస్య తరచూ ఆరోగ్య సమస్యగా మారి సికిల్ సెల్ వ్యాధికి దారి తీస్తుంది. ఈ వ్యాధి మన్యం ప్రాంతంలో ఉండే ప్రజలకు వంశపారంపర్యంగా ఎక్కువగా సోకుతుంది. ఆ వ్యాధి సోకిన రోగులు జీవనోపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు తరలివచ్చి జీవిస్తే రక్తహీనత ఉన్నవారికి సత్వరమే సోకే అవకాశం ఉంది. సికిల్ సెల్ వ్యాప్తి ప్రమాద తీవ్రతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం వ్యాధికి మూల కారణమైన రక్తహీనత నివారణకు ప్రచార కార్యక్రమాలను ఉధృతంగా చేపడుతుంది. దేశ వ్యాప్తంగా ఇటీవల చర్చనీయాంశమైన సికిల్ సెల్ ఎనీమియా నివారణకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది.

రక్తహీనత నివారణతోనే వ్యాధి నిర్మూలన

రక్తహీనత నివారణతోనే సికిల్ సెల్ వ్యాధిని నిర్మూలన చేయవచ్చని ప్రపంచ ఆరోగ్య కేంద్రాల ఆదేశాల మేరకు పాఠశాల దశ నుంచే రక్తహీనత నివారణకు వైద్య ఆరోగ్య శాఖ దేశ వ్యాప్తంగా ఎనీమియా ముక్త భారత్ కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. అందులో భాగంగా రక్తహీనత సమస్య పరిష్కారానికై పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల ఆరోగ్య వివరాలు సేకరించడం, తగిన చికిత్స అందించడం ప్రాథమిక అవసరమని గుర్తించింది. సాధారణంగా అనారోగ్యం పాలైన మహిళల్లో అధికంగా సంభవించే అవకాశం ఉండటంతో ఈ వ్యాధి నివారణకు పీహెచ్‌సీల స్థాయిలో ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో 23 పీహెచ్‌సీలు, నాలుగు సీహెచ్‌సీల, పీహెచ్‌సీల పరిధిలో రక్తహీనతపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు.

సికిల్‌సెల్ వ్యాప్తికి కారణాలు

జన్యుపరమైన ఎర్రరక్తకణాల రుగ్మతను సికిల్‌సెల్ ఎనీమియా అంటారు. శరీర కణజాలానికి ప్రాణవాయువును అందించే గుండ్రని ఆకారం కలిగిన ఎర్ర రక్తకణాలు సికిల్ (కొడవలి) ఆకారంలోకి మారడంతో రక్త నాళాలు మూసుకుపోయి ప్రమాదం వాటిల్లుతుంది. హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్నవారిని వ్యాధి ఆశిస్తుంది. వ్యాధి సోకిన వారిలో ఒక జన్యువు కొడవలి ఆకారంలోనూ, మరొకటి సాధారణ ఆకారంలోనూ ఉన్నట్టయితే వారిని సికిల్ సెల్ క్యారియర్లు అంటారు. అలాంటి వ్యక్తులకు ఎటువంటి అనారోగ్యం కలిగే అవకాశం లేదు. కాని వ్యాధి సంభవించిన వారికి రెండు జన్యువులు కొడవలి ఆకారంలో ఉన్నట్లయితే ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. అలాగే చిన్నారుల్లో పుట్టిన తర్వాత 5–6 నెలల వరకూ వ్యాధి లక్షణాలు బయట పడవు. సాధారణంగా రక్తకణాలు 120 రోజుల వరకూ జీవించి ఉంటాయి. కాని సికిల్‌సెల్ వ్యాధి బాలిన పడిన చిన్నారుల్లో 20–25 రోజులు మాత్రమే ఉంటాయి. రక్తకణం ఆకారం కొడవలి ఆకారంలో ఉండడంతో రక్తనాళాల్లో సరిగ్గా ప్రవహించక పోవడమూ, సరైన మందులు లభ్యం కాకపోవడంతో ప్రాణవాయువు అందక 15 ఏళ్లలోపే చనిపోతున్నారు.

వ్యాధి నియంత్రణకు కృషి

సాధారణంగా గిరిజన ప్రాంతాల్లో వ్యాప్తి చెందే ఈ సికిల్ సెల్ వ్యాధి నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తుంది. గిరిజన జనాభాలో ప్రతి 86 మందిలో ఒకరికి వ్యాధి సోకుతున్నట్టు గుర్తించింది. వివాహం చేసేముందు ఇద్దరికీ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు చేయడం ద్వారా వ్యాధిని నియంత్రించేందుకు చర్యలను తీసుకుంటుంది. జన్యువు కలిగి ఉన్న క్యారియర్ల మధ్య వివాహాలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ కార్యాచరణ ఇలా...

దేశంలో 2047 నాటికి సికిల్‌సెల్ ఎనీమియాను నిర్మూలించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేసింది. వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక గుర్తింపు కార్డులను అందజేస్తుంది. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనలో భాగంగా రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమం, మహిళా, శిశు, గిరిజన సంక్షేమ శాఖల సమన్వయంతో కార్యక్రమాలను విస్తృతం చేసింది. వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడం, నిర్ధారణకై పరీక్షలు చేయడం, వ్యాధి సోకినవారికి కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా జూన్ 19న ప్రపంచ సికిల్‌సెల్ అవేర్‌నెస్ డేను పాటించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

సికిల్‌సెల్ వ్యాధి లక్షణాలు

- రక్త కణాల సంఖ్య తగ్గడంతో రక్తహీనత వస్తుంది.
- కళ్లు పసుపు రంగులోకి మారతాయి. తీవ్రమైన ఒళ్ల, కీళ్లనొప్పులు సంభవిస్తాయి.
- శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఎదురవుతుంది. అలసట సంభవిస్తుంది.
- అంటువ్యాధులు సంక్రమించే అవకాశం ఉంటుంది.
- ఒక్కోసారి శరీర అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది.
- వీపు, కాళ్లు, ఛాతి భాగాల్లో విపరీతమైన నొప్పి వస్తుంటుంది. విరేచనాలు, జ్వరం, డీహైడ్రేషన్, ఒత్తిడి, అలసట వంటి లక్షణాలు నొప్పులను మరింత తీవ్రం చేస్తాయి.

విద్యార్థి దశ నుంచి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



చిన్నారి దశ నుంచి ఆరోగ్యంపై ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టాలి. తరచూ పిల్లల్లో సంభవించే ఆరోగ్య విషయంలోని మార్పులను గమనిస్తుండాలి. రక్తహీనత సమస్య పరిష్కారం కోసం ఆహారంలో ఆకుకూరలు, పండ్లు ఉండేలా జాగ్రత్తపడాలి. మోతాదుకు తగినట్టు మాంసాహారాన్ని అందిస్తుండాలి. పెద్దవారు ఆహారంతో పాటు జీవన శైలిలో సైతం మార్పులు చేసుకోవాలి.

– డి.సాయికిషోర్, వైద్యాధికారి, పెదపళ్ల పీహెచ్‌సీ

క్లుప్తంగా

27న ఉద్యోగ మేళా

మలికిపురం: ఈ నెల 27న ఉదయం 9 గంటల నుంచి మలికిపురంలోని ఎంవీఎన్‌జేఎస్–ఆర్వీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో వన్‌ఎం వన్ బీ ఫౌండేషన్ సమన్వయంతో భారీగా ఉద్యోగ మేళా జరుగుతుందని సంస్థ డైరెక్టర్ అభిరామ్ శనివారం తెలిపారు. ఈ ఉద్యోగ మేళాలో ఏడు ప్రముఖ సంస్థల నుంచి 300కు పైగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. నెల జీతం రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు అందించనుందన్నారు. పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డీ–ఫార్మసీ, బీ–ఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనవచ్చు. అభ్యర్థులు తప్పనిసరిగా తమ బయోడేటా, విద్యా సర్టిఫికెట్ల జెరాక్స్ నకళ్లు వెంట తీసుకురావాలని అన్నారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు


మందపల్లిలో శనైశ్చరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. శనికి ప్రీతికరమైన శనివారంతో పాటు మధ్యాహ్నం నుంచి త్రయోదశి తిథి కలసి రావడంతో ప్రతి శనివారం కంటే మించి భక్తులు శనైశ్చరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. దేవదాయ–ధర్మాదాయ శాఖ డీసీ, ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో స్వామివారి భక్తుల పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అత్యధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ముందుగా ప్రాతఃకాల సమయంలో ఆలయ ప్రధాన అర్చకుడు అయిలూరి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. భక్తులు ప్రత్యక్షంగా పూజలు, తైలాభిషేకాల టికెట్ల ద్వారా రూ.4,10,260, ఆన్‌లైన్ పరోక్ష పూజల ద్వారా రూ.3,71,200, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.41,433తో కలిపి మొత్తం రూ.8,22,893 ఆదాయం వచ్చినట్టు డీసీ అండ్ ఈఓ తెలిపారు.

ఆలయ అభివృద్ధికి విరాళం


మలికిపురంలో దాత మండెలను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మలికిపురం: మలికిపురంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధికి స్థానిక ఇండేన్ గ్యాస్ డీలర్ మండెన సత్యనారాయణ మూర్తి విరాళంగా రూ.51,116 అందించారు. శనివారం ఆలయం వద్ద ఆలయ కమిటీకి ఈ మేరకు చెక్కు అందించారు. దాత సత్యనారాయణను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, వర్తక సంఘం అధ్యక్షుడు మిరియాల హనుమంతరావు, పల్లపోతు బంగారం, వై.ఫణి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

అంబాజీపేట: యోగాతో మానసిక ఒత్తిడిని దూరం చేసుకొని ప్రశాంతమైన జీవనం కొనసాగించొచ్చని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలు, అధికారులకు యోగా శిక్షణను శనివారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ యోగా చేయడం వల్ల ఆరోగ్యానికి మహా భాగ్యం కలుగుతుందన్నారు. పురాతన కాలం నుంచి ఎంతో మంది యోగాసనాలతో ఆరోగ్యపరంగా గొప్ప ప్రయోజనాలు పొందారన్నారు. తీవ్ర ఒత్తిడితో ఉద్యోగాలు చేసే వారందరికి యోగా ఔషధంలా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.భీమారావు, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ఎంపీటీసీలు వడలి కృష్ణమూర్తి, నూకపెయ్యి సత్యనారాయణ, పబ్బినీడి రాంబాబు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్వో వాటర్ ఫిల్టర్ బహూకరణ


గుమ్మిలేరులో సర్పంచ్ రాంబాబుకు వాటర్ ఫిల్టర్ అందజేస్తున్న దాతలు

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరు గ్రామ సచివాలయానికి శనివారం ఆర్వో వాటర్ ఫిల్టర్ బహూకరణ జరిగింది. గ్రామ సచివాలయానికి వచ్చే ప్రజల తాగునీటి సమస్యలను గుర్తించిన గ్రామానికి చెందిన వంక వెంకటరమణ తన భర్త వీర్రాజు జ్ఞాపకార్థం సుమారు 15 వేల విలువైన ఆర్ఓ వాటర్ ఫిల్టర్‌ను సర్పంచ్ గుణ్ణం రాంబాబు చేతుల మీదుగా పంచాయతీకి అందజేశారు. ప్రజల అవసరాలను గుర్తించి ఆర్వో ప్లాంట్‌ను అందజేసిన కుటుంబ సభ్యులను సర్పంచ్ రాంబాబుతో పాటుగా పలువురు సిబ్బంది, గ్రామ ప్రజలు అభినందించారు. వంక వీర వెంకట శ్రీహరి, వంక సతీష్ పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆవిర్భావం


నూతన కమిటీతో వాకర్స్ కమిటీ జిల్లా సభ్యులు

మలికిపురం: మండలంలోని లక్కవరం గ్రామ కేంద్రంగా శనివారం వాకర్స్ క్లబ్‌ను ప్రారంభించారు. వాకర్స్ 103 జిల్లా గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు జల్లి సుజాత (అమలాపురం) చేతుల మీదుగా ప్రారంభించారు. లక్కవరం ఎంజీ గార్డెన్స్‌లో మాజీ సర్పంచ్ మంగెన వెంకట నరసింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో క్లబ్ కార్యవర్గాన్ని నియమించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా శృంగారపు వేణు గోపాలరావు, గుబ్బల రమేష్, కోశాధికారిగా దొడ్డా వెంకటేశ్వరరావు (బాబ్జీ), గౌరవ అధ్యక్షుడిగా మంగెన వెంకట నరసింహారావు, గౌరవ సలహాదారుడిగా గుబ్బల బాబ్జీ, బోనం సాయిరాంలతో ఏర్పాటైన నూతన కార్యవర్గాన్ని 103 జిల్లా వాకర్స్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు ప్రకటించారు. త్వరలో విస్తృత స్థాయిలో సభ్యులను సమీకరించి ప్రజలకు నడక, యోగా, సైక్లింగ్ తదితర వ్యాయామ పద్ధతులతో ఆరోగ్యసాధనపై నిరంతర అవగాహన కలిగేలా ప్రచారం చేయడంతో పాటు, చైతన్యం కల్పిస్తామని నూతన అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, మాజీ జెడ్పీటీసీ మంగెన భూదేవి, పచ్చిగోళ్ల సుధ, గుర్రాల అమల, మంగెన మురళీకృష్ణ, ఏఎన్నార్, కొడవటి దొరబాబు, బండారు విజయ్ కుమార్, ఉలిశెట్టి లక్ష్మణరావు, బోనం సాయి, పలచోళ్ళ రాంబాబు, రేకపల్లి వేణు, ఆచంట ఏసు, వింజమూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాలను విజయవంతంగా పూర్తి చేద్దాం


అంబాజీపేటలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ భీమారావు

అంబాజీపేట: రానున్న గోదావరి పుష్కరాలను అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో విజయవంతంగా పూర్తి చేద్దామని ఇన్‌చార్జి ఎంపీడీఓ జి.భీమారావు అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయలో ఎంపీటీసీలకు, సర్పంచ్‌లకు, అధికారులకు పుష్కరాలకు చేయవలసిన పనులపై సమావేశాన్ని శనివారం నిర్వహించారు. భీమారావు మాట్లాడుతూ పుష్కరాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రణాళికలను సిద్ధం చేయాల్సి ఉందన్నారు. పుష్కర ఘాట్లు ఉన్న గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి, కొత్త ఘాట్ల నిర్మాణం, రహదారుల నిర్మాణం, టాయిలెట్స్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి చేద్దామన్నారు. సమావేశంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీటీసీలు వడలి కృష్ణమూర్తి, నూకపెయ్యి సత్యనారాయణ, వాకపల్లి దొరబాబు, పబ్బినీడి రాంబాబు, విద్యుత్ శాఖ జేఈ మోహన్ పాల్గొన్నారు.

పశువుల దాణాపై 50 శాతం రాయితీ


పొదలాడలో పాడి రైతులకు అందిస్తున్న దాణా బస్తాలు

రాజోలు: పశువుల దాణాను 50 శాతం రాయితీతో పాడి రైతులకు అందిస్తున్నామని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ రవికుమార్, డాక్టర్ లక్ష్మీబాయివాస్‌లు తెలిపారు. శనివారం పొదలాడ, రాజోలు, తాటిపాక గ్రామాలకు చెందిన పాడి రైతులకు దాణా బస్తాలను పంపిణీ చేశారు. రూ.1,100 ధర కలిగిన దాణా బస్తాను రూ.555లకు ఇస్తున్నామన్నారు. పొదలాడలో సర్పంచ్ కడలి సత్యనారాయణ, ఎంపీటీసీ శిరిగినీడి వెంకటేశ్వరరావులు రైతులకు దాణా బస్తాలు పంపిణీ చేశారు. పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ వందే వెంకన్నబాబు, పాడి రైతులు శిరిగినీడి పల్లపురాజు, పట్టా చంద్రమోహన్, దాకే లకురాజు, రావూరి పద్మరావు, మనేపల్లి సత్యనారాయణ, కోళ్ల గణపతిరావు, పోతురాజు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముంపునీటిని సముద్రంలోకి ఎత్తి పోయండి


కేశవదాసుపాలెంలో ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే దేవ

సఖినేటిపల్లి: డ్రైనేజీ కాలువలు పొంగి పొర్లుతున్న సమయాల్లో నష్టపోతున్న పంట పొలాల రక్షణకు, ఇబ్బందులు పడుతున్న నివాసిత ప్రాంతాల వారికి మేలు చేకూర్చే విధంగా మోటార్ల సహకారంతో లిఫ్టింగ్ (ఎత్తిపోతల) ద్వారా ముంపు నీటిని సముద్రంలోకి ఎత్తిపోసేలా ప్రణాళిక సిద్ధం చేయాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, సదరు శాఖ అధికారులకు సూచించారు. శనివారం కేశవదాసుపాలెంలో భారీ వర్షాలకు ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో ముందస్తుగా ఆయన అధికారులతో కలసి పర్యటించారు. అనంతరం సర్పంచ్ మేడిద సరోజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామంలో చోటు చేసుకుంటున్న ముంపు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి గ్రామస్తులు తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో డ్రైనేజీ నీరంతా సముద్రంలో కలిసేదని, ప్రకృతి కారణాల రీత్యా, సముద్ర మట్టం పెరగడం రీత్యా పోటు సమయంలో ఉప్పునీరు వెనక్కి చొచ్చుకొని వస్తోందని తెలిపారు. ముంపు నీరు ఎత్తిపోయడం ద్వారా చాలా మేరకు సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. డ్రైనేజీ శాఖ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ పరిసరాల్లో చెట్లను తొలగించాలి


నగరం పీహెచ్‌సీ పాత భవనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ మాధవి

మామిడికుదురు: నగరం పీహెచ్‌సీ పాత భవనం చుట్టూ దట్టంగా మొలిచిన చెట్లను తక్షణం తొలగించి పీహెచ్‌సీ పరిసరాలను పరిశుభ్రం చేయాలని అమలాపురం ఆర్డీఓ కె.మాధవి ఆదేశించారు. పాడైపోయిన నగరం పీహెచ్‌సీ పాత భవనాన్ని ఆర్డీఓ శనివారం పరిశీలించారు. పాడైపోయిన పాత భవనాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కొత్త భవనం అందుబాటులో ఉండగా పాత భవనంలో చిన్నారులకు పోలియో చుక్కలు ఎందుకు వేస్తున్నారంటూ పీహెచ్‌సీ ఉద్యోగులపై మండిపడ్డారు. ఆమె వెంట తహసీల్దార్ శరణ్య, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి స్వర్ణలత, పీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారు.

వైభవంగా అమ్మవార్ల జాతర


జగ్గన్నపేటలో కొలువైన పళ్లాలమ్మ

మామిడికుదురు: మొగలికుదురు గ్రామ పరిధిలోని జగ్గన్నపేటలో కొలువుదీరిన పళ్లాలమ్మ, పెదపట్నంలంక బొక్కావారిపాలెంలో కొలువైన మహాలక్ష్మమ్మ జాతర మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. గరగనృత్యాలు, చిత్ర విచిత్ర వేషధారణలు, తీన్‌మార్ విన్యాసాలు, పూజాఘటం ఊరేగింపు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ జాతర ఆద్యంతం కన్నుల పండువలా జరిపించారు. జాతర సందర్భంగా అమ్మవార్లను భక్తులు దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు. మొగలికుదురు అమ్మవారికి సోమవారం నైవేద్యాలు చెల్లిస్తారని, 30వ తేదీ శుక్రవారం అమ్మ సమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. పెదపట్నంలంక అమ్మకి ఆదివారం భక్తులు నైవేద్యాలు చెల్లిస్తారని, సిరిబొమ్మ తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

వేంకటేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు


భక్తులతో పోటెత్తిన నల్లచెరువు వేంకటేశ్వరస్వామి ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. స్వామివారి దర్శనం కోసం తెల్లవారు జాము నుంచి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. వేంకటేశ్వరస్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామికి తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు జరిపారు. వేదపండితులు స్వామికి లక్ష తులసి పూజ నిర్వహించారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయం వద్ద భక్తులకు భారీ అన్నదానం చేశారు. స్వామివారికి భక్తులు పటిక బెల్లం తులాభారం నిర్వహించి మొక్కు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి గాయాలు

పి.గన్నవరం: పి.గన్నవరం శివారు బోడపాటివారి పాలెం గ్రామంలో శనివారం ఒక పిచ్చికుక్క వీర విహారం చేసింది. ఎస్.నాగమణి, బి.వెంకటేశ్వరరావులను పిచ్చి కుక్క కరవడంతో వారు గాయాలపాలయ్యారు. వీరిలో నాగమణిని పి.గన్నవరం సీహెచ్‌సీకి తరలించగా అక్కడ చికిత్స పొందుతోంది. గ్రామంలో కుక్కలు పెరిగిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితం ఒక పిచ్చి కుక్క ఆరు ఆవులు, ఐదు గేదెలపై దాడి చేసి కరిచింది. ఇకనైనా అధికారులు స్పందించి కుక్కలను పట్టించాలని బోడపాటివారి పాలెం ప్రజలు కోరుతున్నారు.

21 వరకు యోగాంధ్ర మాసోత్సవాలు

అమలాపురం రూరల్: వికసిత్ భారత్ స్ఫూర్తితో ఆరోగ్యకరమైన స్వర్ణాంధ్ర సాకారానికి పునాది పడేలా యోగాంధ్ర మాసోత్సవాలను ఈ నెల 21న ప్రభుత్వం చేపట్టిందని ఈ కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పిలుపునిచ్చారు. శనివారం జీఎంసీ బాలయోగి స్టేడియంలో 100 మంది మాస్టర్ ట్రైనీలతో నిర్వహించే యోగా శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ థీమ్ ఆధారిత యోగాంధ్ర మాసోత్సవాలను పురస్కరించుకొని మే 21 నుంచి జూన్ 21 వరకు జిల్లా వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం యోగా ట్రైనర్ల సేవలను ఉపయోగించుకుంటామన్నారు. రెండు రోజులపాటు మాస్టర్ ట్రైనీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో ట్రైనర్లు అందుబాటులో ఉంటారని, ఒక్కో ట్రైనర్ ఒక సెషన్‌లో కనీసం 50 మందితో యోగాభ్యసనం చేయించనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యేకి రేషన్ డీలర్ల కృతజ్ఞతలు

కొత్తపేట: దూరంగా ఉన్న రేషన్ షాపునకు వెళ్లి రేషన్ తెచ్చుకునే బదులు.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు వ్యయప్రయాసలు తప్పేలా.. రేషన్ డీలర్లకు ఏమాత్రం అన్యాయం జరగకుండా, ఇంటింటికీ రేషన్ పథకాన్ని అమలు చేసిన విషయం తెలిసిందే. దీనిని కూటమి ప్రభుత్వం రద్దు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించింది. దీంతో, వచ్చే నెల నుంచి ప్రజలు ఎక్కడో ఉన్న రేషన్‌షాపు వద్దకు వెళ్లి, వ్యయప్రయాసలతో రేషన్ సరకులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. అలాగే రేషన్ వాహనాల ఆపరేటర్లు, హెల్పర్లు ఉపాధి కోల్పోతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇంటింటికీ రేషన్ అందిస్తున్న వాహనాలను కూటమి ప్రభుత్వం రద్దు చేసి, పూర్వ విధానం పునరుద్ధరించినందుకు రేషన్ డీలర్లు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలికారు. ఈ మేరకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావును వాడపాలెంలోని ఆయన నివాసంలో కలసి కృతజ్ఞతలు తెలిపారు. రేషన్ డీలర్లకు పూర్వవైభవం తెచ్చారని అన్నారు.

పంట కాలువలో కంకర లారీ బోల్తా


పంట బోదెలో బోల్తా పడిన లారీ

పి.గన్నవరం: ఆర్‌పీ రోడ్డులో మండలంలోని మొండెపులంక వద్ద శనివారం తెల్లవారుజామున కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ లారీ అదుపుతప్పి పంట బోదెలోకి పల్టీ కొట్టింది. ప్రమాదం నుంచి లారీ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. పంగిడి నుంచి రాజోలుకు లారీ కంకర లోడుతో వెళ్తుండగా మొండెపులంక వద్ద ప్రమాదానికి గురైంది.

నాయకుడికి జగ్గిరెడ్డి పరామర్శ


అచ్చాయమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జగ్గిరెడ్డి తదితరులు

రావులపాలెం: గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు సత్తి భాస్కరరెడ్డి మాతృమూర్తి సత్తి అచ్చాయమ్మ ఇటీవల మృతి చెందారు. మాతృ వియోగంతో బాధపడుతున్న భాస్కరరెడ్డిని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి శనివారం పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. అచ్చాయమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్గిరెడ్డి వెంట జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు కర్రి నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజానాట్య మండలి నాయకుడు 'దేవ' మృతి

మలికిపురం: మండలంలోని దిండి గ్రామానికి చెందిన సీపీఐ ప్రజానాట్య మండలి సీనియర్ నాయకుడు దేవ కృష్ణమూర్తి (78) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. కమ్యూనిస్టు ఉద్యమానికి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, కార్యకలాపాలతో పాటు, అనేక సాంఘిక, సామాజిక నాటకాలకు, నాటికలకు దర్శకత్వం వహించారని, ఆయన మృతి గ్రామానికి తీరని లోటని పలువురు నాయకులు అన్నారు. ఆయన మృతికి మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, సీపీఐ రాజోలు నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.